పవిత్రతను దెబ్బతీసేందుకే ఆరోపణలు

- తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించనే లేదు
- బల్లిగిరి వెంకన్న ఆలయంలో శ్రీవారి హారతిపై ప్రమాణం చేసిన వాసుపల్లి
- భక్తుల విశ్వాసాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుతోందని ఆగ్రహం


వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్


వేంకటేశ్వర స్వామి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు

అల్లిపురం: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అపవిత్రం చేయలేదని బల్లిగిరి వేంకటేశ్వర స్వామి సన్నిధిలో హారతిపై మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రమాణం చేసి స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం విశిష్టతను దెబ్బతీసేలా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఆడుతున్న డ్రామాలో శ్రీవారి లడ్డూపై చేసిన ఆరోపణలను ఖండిస్తూ ఆయన శనివారం బల్లిగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఆ హామీలు అమలు చేయలేకపోయారని... ఈ సందర్భంగా ప్రజల దృష్టి మరల్చడానికి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. వారి అసత్య ప్రచారాలను, పాపాలను ప్రక్షాళన చేసేందుకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో పూజలు చేపట్టినట్లు తెలిపారు.

ఆలయాలు కూలగొట్టిన చరిత్ర చంద్రబాబుది

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్న ఐదేళ్లలో 6 వేల ఆలయాలను పునరుద్ధరించారని వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. మరో 3 వేల నూతన దేవాలయాలు నిర్మించి సనాతన ధర్మాన్ని కాపాడారన్నారు. ముఖ్యమంత్రిగా 15 సార్లు శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాలు అందజేసే భాగ్యం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. సనాతన ధర్మాన్ని నిజంగా పాటించే జగన్‌మోహన్‌రెడ్డిపై... హిందుత్వాన్ని నాశనం చేస్తూ ఆలయాలను కూలగొట్టే చంద్రబాబు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మూగి శ్రీనివాసరావు మాట్లాడుతూ మతాలతో, భక్తుల విశ్వాసాలతో ఆడుకునే రాజకీయం దేశంలో ఏ పార్టీ చేయని విధంగా కూటమి ప్రభుత్వం చేయడం సిగ్గు చేటన్నారు. వైఎస్సార్‌సీపీ మతం మానవత్వం అని, ప్రజలకు మంచి చేయడమే జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ, కార్పొరేటర్లు చెన్నా జానకీరామ్, బిపిన్ జైన్, ఎం.రమేష్, సర్వేశ్వరరెడ్డి, సనపల రవీంద్రభరత్, ఎర్నమ్మ గుడి ట్రస్ట్ బోర్డు చైర్మన్ లండా రమణ, పార్టీ సీనియర్ నాయకులు లింగం శ్రీనివాస్, రవితేజ, కోన శంకర్, బూర్ల చిన్న, బుల్లెట్ రవి, కోరాడ రమేష్, చంద్రకళ, లక్ష్మీకాంతం, కృష్ణారెడ్డి, ధర్మారెడ్డి, సూర్య, ఆకుల శ్యామ్, ప్రసాదరావు, సునీత, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

అలిపిరిలో శ్రీవారికి వైఎస్సార్‌సీపీ శ్రేణుల పూజలు


అలిపిరిలో పూజలు చేస్తున్న బాపు ఆనంద్, తదితరులు

అల్లిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం తిరుపతి చేరుకున్న దేవకీనంద ట్రస్ట్ అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గం మండల అధ్యక్షుడు దొడ్డి బాపు ఆనంద్ కార్యకర్తలతో కలిసి పూజలు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా తిరుపతి వెళ్లినప్పటికీ ఆయన పర్యటన రద్దు కావడంతో అలిపిరిలో పూజలు నిర్వహించారు. తిరుపతి లడ్డూ ప్రసాదంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని వేంకటేశ్వర స్వామిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. అధికారంలో ఉన్న నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో స్వామి వారి పవిత్రత, భక్తుల విశ్వాసం దెబ్బతినేలా తప్పుడు ఆరోపణలు చేయడం మహా పాపమని బాపు ఆనంద్ అన్నారు. అనంతరం ఆయన కాలినడకన మెట్ల మార్గంలో కొండపైకి చేరుకుని తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

దుర్గమ్మ ఉత్సవాలకు శ్రీకారం


ఉడుపురాట మహోత్సవంలో భక్తులు

అల్లిపురం: స్థానిక మెయిన్ రోడ్డు శ్రీ ధనశక్తి దుర్గాదేవి ఆలయ పీఠం 22వ వార్షికోత్సవం సందర్భంగా ఉత్సవాలకు శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ రాట భక్త జనసందోహం మధ్య వైభవంగా వేశారు. అనంతరం రవిభవాని దంపతులు ముహూర్తపు రాటకు పూజలు చేశారు. ఉడుపురాటను నెలకొల్పి పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా రవిభవాని మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి 12 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. 3న అమ్మవారిని తిరువీధి ఉత్సవం ద్వారా తీసుకొచ్చి ప్రతిష్ఠిస్తామని తెలిపారు. రోజుకో రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

వైభవంగా సుప్రభాత సేవ

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు.

క్లుప్తంగా

డీసీ సుజాతకు ఈవోల అభినందన


డిప్యూటీ కమిషనర్ సుజాతను అభినందిస్తున్న ఈవోలు

మహారాణిపేట: దేవదాయ, ధర్మాదాయ శాఖ విశాఖ ప్రాంతీయ ఉప కమిషనర్(డీసీ)గా పదోన్నతి పొందిన ఎస్.సుజాతను శనివారం పలువురు కార్యనిర్వహణాధికారులు(ఈవో)లు అభినందించారు. ఆలయ ఈవోలు పైలా శేఖర్‌బాబు, అల్లు జగన్నాథం, కీర్తి శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, బొంగరాల మురళీమోహనరావు తదితరులు డీసీని కలిసి శుభకాంక్షలు తెలియజేశారు.

ఆకట్టుకున్న వీధి నాటకం


వీధి నాటక ప్రదర్శనలో కళాకారులు

అల్లిపురం: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, రోడ్లపై, రహదారుల్లోనూ చెత్తాచెదారం పడవేయకుండా చూడాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ విశాఖ రత్న కళాపరిషత్ ఆధ్వర్యంలో శనివారం తాడివీధిలో ప్రదర్శించిన వీధి నాటకం ఆకట్టుకుంది. 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో ప్రదర్శించిన కళాజాత కార్యక్రమంలో భాగంగా దోమల వ్యాప్తిని అరికట్టేందుకు, మురుగు నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు చేపట్టాలని, స్వచ్ఛతతో మెలగాలని కళాకారులు విజ్ఞప్తి చేశారు. ఓలేటి శంకర్, ఎస్.వి.రమణ, మల్లిక, ఈశ్వర్, మస్తాన్ తదితరులు వీధి నాటికలు ప్రదర్శించారు.

దేవీ శరన్నవరాత్రుల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, అన్నపూర్ణ, శేఖర్‌బాబు

జగదాంబ: అక్టోబర్ 3 నుంచి పూర్ణా మార్కెట్ దరి శ్రీ దుర్గాలమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పైలా శేఖర్‌బాబు తెలిపారు. ఈ మేరకు శనివారం అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవీ శరన్నవరాత్రులకు ఏర్పాట్లు చేయాలని, ఆలయాన్ని సుందరంగా అలంకరించాలని కోరారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ మాట్లాడుతూ 3న ఉదయం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా కలశ స్థాపన అనంతరం ఉత్సవాలు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

వీఐపీల భద్రతకు పీఎస్‌వో శిక్షణ


పీఎస్‌వో శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసులతో సీపీ శంఖబ్రత బాగ్చీ

మద్దిలపాలెం: వీఐపీల భద్రతకు నగర పోలీస్ కమిషనరేట్ నుంచి తొలి సారిగా 51 మంది కానిస్టేబుళ్లను ఎంపిక చేసి, పీఎస్‌వో శిక్షణ ఇచ్చామని సీపీ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన 51 మందితో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ వీఐపీల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడానికి ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ వారిచే ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చామన్నారు. ఈ శిక్షణలో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశామన్నారు. అర్హత, సామర్థ్యం కలిగిన వారిని ఎంపిక చేశామని చెప్పారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి



జీవీఎంసీ గాంధీ పార్కులో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దీక్షలో పాల్గొన్న పెన్షనర్లు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించాలని ఆల్ ఇండియా పెన్షనర్స్, రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ (ఆప్రా) జిల్లా అధ్యక్షుడు దీనబంధు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కులో అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన దీక్షలో ఆప్రా సభ్యులు శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1340 రోజులుగా విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమం జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ చాపకింద నీరులా ప్లాంట్‌ను అమ్మేయడానికి ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 4070 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలిగించడానికి ప్రయత్నం చేసిందటే ప్లాంట్‌ని ప్రైవేట్ వాళ్లకి కట్టబెట్టడానికే నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజా ఉద్యమాల్ని గౌరవించకపోవడం దురదృష్టకరమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ని సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌ని కాపాడతామని చెప్పిన చంద్రబాబు రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లను మూసేస్తే ఎందుకు తెరిపించలేకపోతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ని రక్షించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోనాల్సి వస్తుందని హెచ్చరించారు. దీక్షలో వి.లుసీరామ్, కేఎం కుమార్ మంగళం, ఎం.త్రినాథ్, రాంప్రభు తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధ ఫౌండేషన్‌తో ఏయూటీడీ ఎంవోయూ


శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులతో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, తదితరులు

అల్లిపురం : మానసిక వ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తూ, పునరావాసం కల్పిస్తున్న ఏయూటీడీతో కలిసి పనిచేస్తామని రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, శ్రద్ధ ఫౌండేషన్ ఫౌండర్ భరత్ పట్వానీ స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఎంవోయూ కుదుర్చుకున్నట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. శ్రద్ధ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు ఏయూటీడీ 203 మంది మానసిక రోగులను రెస్క్యూ చేసి, మానసిక ఆస్పత్రిలో చికిత్స అందించి ఉత్తరాది రాష్ట్రాల్లోని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ పని మరింత పక్కాగా కొనసాగించేందుకు ఎంవోయూ కుదుర్చుకున్నామని తెలిపారు. ఈ మేరకు ఫౌండేషన్ తరపున ఒక సైక్రియాట్రిస్ట్ టీమ్‌తోపాటు మందులు సమకూర్చినట్లు తెలిపారు. రాబోయే 6 నెలల్లో వంద మంది మానసిక రోగులకు పునరావాసం కల్పించే లక్ష్యంతో పని చేయాలని భరత్ పట్వానీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ స్వరాలీ, శ్రావణి, గౌతమ్, హరీష్, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

విద్యార్థులు మేధస్సును పెంపొందించుకోవాలి



ఉపాధ్యాయులకు జ్ఞాపిక అందజేస్తున్న ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య ఉమామహేశ్వరరావు

మహారాణిపేట : దొండపర్తి దరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కార్యాలయం సమావేశ మందిరంలో భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ, ఝాన్సీ లక్ష్మీబాయి మహిళా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో భారత్ కో జానో, గురువందన్ ఛత్రాభినందన్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీవీపీ ప్రాంత అధ్యక్షుడు వంకాయల సన్యాసిరాజు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సంస్థ చేపట్టిన కార్యక్రమాలు వివరించి నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఆంధ్ర విశ్వ కళాపరిషత్ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు మేధస్సును పెంపొందించుకోవాలని సూచించారు. గురువు దైవంతో సమానమని గురువుల ప్రాముఖ్యతను తెలిపారు. తర్వాత ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం బీవీపీ ప్రతినిధులు రమేష్ చంద్ జైన్, యంవీవీ సత్యనారాయణ, ఎం.వి.రాజశేఖర్, ఎం.ఎస్.ఎల్.శైలజ, పి.వెంకటేశ్వరరావు ప్రసంగించారు. క్విజ్ మాస్టారుగా ఎం.జగదీష్ ప్రసాద్ వ్యవహరించారు. కార్యక్రమంలో బీవీపీ విశాఖ శాఖ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ, కార్యదర్శి పి.భాస్కరరావు, కోశాధికారి జీఎస్‌వీ మాణిక్యాలరావు, మహిళా శాఖ అధ్యక్షురాలు పి.షర్మిల, కార్యదర్శి సీహెచ్ నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పిడికిలి బిగిద్దాం

సీతంపేట: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్టోబరు 2న జరిగే భారీ ర్యాలీని విజయవంతం చెయ్యాలని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వి.వి.రమణమూర్తి పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర ప్రజా సంఘాల నాయకులతో కలిసి ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చెయ్యడానికి దూకుడు పెంచుతున్న సమయంలో ఉత్తరాంధ్ర ప్రజా సంఘాలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల ప్రజా సంఘాలన్నీ కలిసి మహా ఉద్యమంలా డాబాగార్డెన్స్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద తదుపరి కార్యక్రమం కోసం తీర్మానం చేసి లక్ష మందితో ర్యాలీ చెయ్యడానికి నిర్ణయం తీసుకుంటామన్నారు. నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.లక్ష్మి, వై.నూకరాజు, జె.రవి, కె.ఎస్.చలం, కె.పద్మ, ఉప్పల లక్ష్మణరావు, పి.ఎస్.తిలక్, ఎస్ఎస్ శాస్త్రి పాల్గొన్నారు.


ప్రజా సంఘాల నాయకులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వి.వి.రమణమూర్తి

సాగరతీరంలో వాక్‌థాన్


వాక్‌థాన్‌లో పాల్గొన్న వైద్యులు, ఉద్యోగులు

బీచ్‌రోడ్డు: వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని అపోలో హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం గుండె జబ్బులపై ఆర్కే బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు నడక సాగింది. ప్రఖ్యాత కార్డియాలజిస్టులు, కార్డియోథొరాసిక్ సర్జన్లు డాక్టర్ డి.కె.బారుహ్, డాక్టర్ ఎస్.కె.పాణిగ్రాహి, డాక్టర్ త్రివేది, డాక్టర్ విజయ్.ఎల్, డాక్టర్ శశాంక్.సి, డాక్టర్ చక్రధర్ పి, అపోలో సీవోవో డాక్టర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు. వీరితోపాటు ఇతర నిపుణులు, వైద్యులు, రెండు వేల మందికి పైగా కార్పొరేట్ ఉద్యోగులు, ఆరోగ్య స్పృహ కలిగిన వారు వాక్‌థాన్‌లో నడిచారు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ డి.కె.బారుహ్ మాట్లాడుతూ దేశ యువతలో గుండెపోటు మరణాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. విశాఖ అపోలో హాస్పిటల్స్ నిర్వహించిన అధ్యయనంలో 45 ఏళ్ల కంటే తక్కువ వయసున్న యువకుల్లో ఏఎంఐ సంబంధిత ప్రమాద కారకాలతో బాధపడుతున్నట్లు తెలిసిందని చెప్పారు. ధూమపానం, మద్యపానం చేయకూడదని, జంక్ ఫుడ్స్, పానీయాలకు దూరంగా ఉండాలని, ప్రతి రోజూ వ్యాయామం చేయాలని యువతకు సూచించారు.

108 మంది పోలీసులకు రివార్డులు


సీపీ చేతుల మీదుగా రివార్డు అందుకుంటున్న వన్‌టౌన్ కానిస్టేబుల్ చిరంజీవి

మద్దిలపాలెం: నగర పోలీసు శాఖలో ఉత్తమ సేవలందించిన 108 మంది అధికారులు, సిబ్బందికి నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి రివార్డులు అందజేశారు. వృత్తిలో అంకితభావంతో పని చేసిన హోంగార్డు స్థాయి నుంచి సీఐ స్థాయి అధికారులకు రివార్డులను అందజేశారు. ప్రతి నెలా ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహకాలు అందజేస్తున్నామన్నారు.తమ ప్రతిభను గుర్తించి, ఉన్నతాధికారుల సమక్షంలో పోలీసు కమిషనర్ రివార్డులు అందజేయడంపై సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి


బహుమతులు పొందిన ఎన్‌సీసీ క్యాడెట్లతో కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు

అల్లిపురం: రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ థీమ్‌తో విద్యార్థులకు పోటీ నిర్వహించినట్లు విశాఖ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వేస్ట్ మెటీరియల్‌తో ఎన్‌సీసీ క్యాడెట్లు డెకరేటివ్ వస్తువులు తయారు చేశారని చెప్పారు. వ్యర్థాల నుంచి కళాకండాలు సృష్టించే దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. వృథాగా పడి ఉన్న వస్తువులను తిరిగి వినియోగించడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని సూచించారు. కళాశాల లెఫ్టినెంట్ డాక్టర్ కె.గీతాంజలి మాట్లాడుతూ సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి.సంతోషి దూష, వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ ఆర్.కిరణ్మయి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సకాలంలో జ్వర బాధితులను గుర్తించాలి


నరసింహనగర్ యూపీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : నరసింహనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శనివారం పరిశీలించారు. అక్కడ అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. పథకాల అమలులో ఎలాంటి బ్యాక్‌లాగ్స్ లేకుండా చూసుకోవాలని, అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్, తదితర వాటిపై సూచనలు చేశారు. అభ యాప్ శత శాతం డౌన్లోడ్ చేయించాలని, ఆధార్ నంబర్ లేకుంటే సంబంధిత ఆశ కార్యకర్తతో యాప్ అప్లోడ్ చేయించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి జ్వర బాధితులను సకాలంలో గుర్తించాలని ఆదేశించారు. యాంటీ లార్వా ఆపరేషన్‌పై స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. లీవ్ రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. గర్భిణులకు ఐరన్ మాత్రలు అందజేయాలన్నారు. ఆయనతోపాటు జిల్లా మీడియా విస్తరణాధికారి (డిమో) బి.నాగేశ్వరరావు, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలల విద్యార్థులకు ప్రతిభా పోటీలు


విజేతలతో డాక్టర్ ఎం.ఎస్.నాయుడు, సెయింట్ జోసెఫ్ కళాశాల అధ్యాపక బృందం

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ద్వితీయ భాషా విభాగ అధ్యక్షురాలు డాక్టర్ పి.కె.జయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం అంతర కళాశాలల ప్రతిభా పోటీలు నిర్వహించారు. వీటిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, ముఖ్య అతిథి ఎ.వి.ఎన్.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. వక్తృత్వం, పద్య పఠనం, చిత్రలేఖనం, గీతాలాపన, వ్యాసరచన, హాస్యవల్లరి పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసపత్రాలు అందజేశారు. నగరంలోని సుమారు 10 కళాశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. కార్యక్రమంలో డాక్టర్ నిర్మల, డాక్టర్ దీప్తి, సిస్టర్ మేరీ, డాక్టర్ ఆంజలే, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 43 మందికి ఉద్యోగాలు


రాతపరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో పాలిటెక్నిక్, స్కిల్ హబ్ సంయుక్తంగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాబ్ మేళా శనివారం ముగిసింది. పోకార్నా ఇంజినీరింగ్ స్టోన్ లిమిటెడ్, ఏసీఎన్ హెల్త్ కేర్ ఆర్‌సీఎం సర్వీసెస్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ సంస్థలు నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు 179 మంది హాజరవగా 35 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు చెప్పారు. మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలకు 102 మంది హాజరవగా 8 మంది ఎంపికైనట్లు తెలిపారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ ఎంఏవీ రామకృష్ణ మార్గదర్శకత్వంలో డీఎస్‌డీవో చాముండేశ్వరనాథ్, టీపీవో ఎం.హరిబాబు సహకారంతో ఈ ఇంటర్వ్యూలు విజయవంతంగా నిర్వహించామని ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ మేరకు విద్యార్థులకు ఎంపిక పత్రాలు అందించారు.

భగత్‌సింగ్‌ను స్మరించుకోవడం అవసరం


భగత్ సింగ్ జయంతి కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు

అల్లిపురం : దిశ విద్యార్థి సంఘం, నవజవాన్ భారత్ సభ (ఎన్‌బీఎస్) ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి శనివారం ఏవీఎన్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గత రెండు వారాలుగా నగరంలోని వివిధ స్కూళ్లు, కళాశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాడిన విప్లవ గీతాలకు మంచి స్పందన లభించింది. దిశ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ అవినాష్ మాట్లాడుతూ భగత్‌సింగ్ లోతైన ఆలోచన కలిగిన విప్లవకారుడని కొనియాడారు. కార్యక్రమంలో ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సింహాద్రినాయుడు మాట్లాడుతూ నేటి యుగంలో భగత్‌సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల వారసత్వాన్ని స్మరించుకోవడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో నవజవాన్ భారత్ సభ సభ్యుడు సుజన్, అజయ్, అధ్యాపకులు పాల్గొన్నారు.